సాక్షి
కుమురం భీం

గురువారం । 30 । నవంబర్ । 2023

ఆ పోలింగ్ కేంద్రాలపై డేగ కన్ను !



మావోయిస్టు ప్రభావిత పోలింగ్ కేంద్రాలపై భద్రతా బలగాలు ప్రత్యేక దృష్టి సారించాయి. బందోబస్తు ఏర్పాటు చేయడంతోపాటు డ్రోన్ కెమెరాలతో పెట్రోలింగ్ చేస్తున్నారు. 2లో▸



ఎవరికీ పట్టని సరిహద్దు గ్రామాలు

సరిహద్దులోని వివాదాస్పద గ్రామాల్లోని ఓటర్లు నేడు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. 14 గ్రామాల్లో 3,383 మంది ఓటర్లు ఉన్నారు. 2లో▸

గరిష్ఠం/కనిష్ఠం
31.0/20.1

వాతావరణం

ఆకాశంలో అక్కడక్కడ మేఘాలు ఉంటాయి. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. అల్పపీడనం ప్రభావంతో ఒకటిరెండు చోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సమన్వయంతో విధులు నిర్వర్తించాలి



మాట్లాడుతున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా వ్యాప్తంగా అసెంబ్లీ ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బందికి జిల్లా కేంద్రంలోని తెలంగాణ ట్రైబల్ సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలో బుధవారం అవగాహన కార్యక్రమం(బ్రీఫింగ్ సెషన్) నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ శాంతియుతంగా సాగేందుకు ప్రతీ పోలీసు అధికారి, సిబ్బంది కృషి చేయాలన్నారు. విధి నిర్వహణలో ఉండే ఎన్నికల సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని సూచించారు. ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద నిబంధనలు పాటించే విధంగా చూసుకోవాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్న గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే తక్షణమే సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. ఓటర్లకు భరోసా కల్పించేలా పారదర్శకంగా విధులు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

వాంకిడి(ఆసిఫాబాద్): మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను బుధవారం ఎస్పీ సురేశ్ కుమార్ పరిశీలించారు. ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బందికి సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి అల్లర్లకు దిగితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీఐ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

ప్రయాణికుల రద్దీ



జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో ప్రయాణికులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో నుంచి బస్సులను ఎన్నికల సిబ్బందిని చేరవేసేందుకు కేటాయించడంతో బుధవారం ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. హైదరాబాద్‌కు నడిచే సూపర్ లగ్జరీ బస్సులు మినహా డిపోలో 79 బస్సులు ఉన్నాయి. ఇందులో 57 బస్సులను వివిధ పనుల కోసం కేటాయించినట్లు అధికారులు తెలిపారు. 22 బస్సులు మాత్రమే ఉండటంతో ఆసిఫాబాద్ బస్టాండ్‌లో రద్దీ కనిపించింది.



ఓటేద్దాం.. రండి

రాష్ట్రంలోనే తొలి నియోజకవర్గమైన 'సిర్పూర్' నుంచి కాగజ్‌నగర్ మండలం చిన్నమాలిని గ్రామానికి చెందిన ఆత్రం రంభాబాయి రాష్ట్ర తొలి ఓటరుగా నిలిచారు. అలాగే ఆసిఫాబాద్ నియోజవకర్గానికి సంబంధించి నార్నూర్ మండలం ముక్తాపూర్ గ్రామానికి చెందిన ఉయిక అమృత్‌రావు తొలి ఓటరుగా ఉన్నారు. నేడు అసెంబ్లీ ఎన్నికల్లో బాధ్యతగా ప్రతిఒక్కరూ ఓటు వేయాలని వారు కోరుతున్నారు.

ఓటు విలువైనది



కాగజ్‌నగర్‌రూరల్: నాకు ఓటుహక్కు వచ్చిన తర్వాత ఇప్పటివరకు జరిగిన ప్రతీ ఎన్నికల్లో ఓటేశాను. ప్రతిఒక్కరూ బాధ్యతగా ఓటుహక్కు వినియోగించుకోవాలి. ఓటు ఎంతో విలువైనది. డబ్బు, ప్రలోభాలకు లొంగకుండా అభివృద్ధి చేసే నాయకుడిని ఎన్నుకోవాలి. ఓటు వేయకపోతే చచ్చినట్టే లెక్క. ఎంత పని ఉన్నా భవిష్యత్తు కోసం కొంత సమయం కేటాయించి ఓటు వేయాలి. సిర్పూర్ నియోజకవర్గంతోపాటు తెలంగాణ రాష్ట్ర తొలి ఓటరుగా ఉండటం గర్వంగా ఉంది.

– ఆత్రం రంభాబాయి, చిన్న మాలిని, మం.కాగజ్‌నగర్ (రాష్ట్ర తొలి ఓటరు)

మన బాధ్యత



నార్నూర్: ఆసిఫాబాద్ నియోజకవర్గం తొలి ఓటరుగా ఉండటం సంతోషంగా ఉంది. తాడిహత్నూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో గురువారం ఓటు వేస్తా. పేద ప్రజల సంక్షేమం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం పాటుపడే మంచి నాయకుడిని ఎన్నుకోవాలి. డబ్బు, మద్యం, ఇతర ప్రలోభాలకు ఓటరు అమ్ముడుపోవద్దు. ఓటేయడం బాధ్యతగా భావించి ప్రతిఒక్కరూ సరైన పాలకుడిని ఎన్నుకోవడంలో తమ వంతు కృషి చేయాలి.

– ఉయిక అమృత్‌రావు, ముక్తాపూర్, మం.నార్నూర్ (ఆసిఫాబాద్ నియోజకవర్గ తొలిఓటరు)



ఎన్నికల సిబ్బందికి సూచనలిస్తున్న ఆసిఫాబాద్ రిటర్నింగ్ అధికారి దాసరి వేణు



సమరానికి సిద్ధం

- నేడు జిల్లాలో పోలింగ్
- రెండు అసెంబ్లీ స్థానాలకు ఓటింగ్
- ఉదయం 5.30 గంటలకు మాక్ పోలింగ్
- అదృష్టాన్ని పరీక్షించుకోనున్న అభ్యర్థులు

సాక్షి, ఆసిఫాబాద్: ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత మూడోసారి జరుగుతున్న శాసన సభ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. గురువారం జరిగే ఎన్నికలకు జిల్లాలో రెండు నియోజకవర్గాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గెలుపు మాదే అని ధీమా వ్యక్తం చేస్తున్న పార్టీలకు ఓటర్లు తీర్పును ఇవ్వనున్నారు. ఎవరి చేతికి రాష్ట్ర పగ్గాలు అప్పగించాలో నిర్ణయించనున్నారు. ఈ ఎన్నికల బరిలో ఉన్న 30 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఇందులో మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బీఆర్ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్ప, రెండోసారి ఎమ్మెల్యేగా గెలవాలని భావిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి, తొలిసారి ఎన్నికల బరిలో నిలిచిన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, గత ఓటమి లెక్కలు సరిచేయాలన్న కసితో ఉన్న బీజేపీ అభ్యర్థి డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు తదితరులు ప్రస్తుతం బరిలో ఉన్నారు.

సాయంత్రం 4గంటల వరకే పోలింగ్..

జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలకు యంత్రాంగం పూర్తి ఏర్పాట్లు చేసింది. మంగళవారం సాయంత్రంతో ప్రచారం పరిసమాప్తం కాగా.. అభ్యర్థులు పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి సారించారు. గురువారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమవుతుంది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఒక గంట ముందుగానే అంటే సాయంత్రం 4 గంటలకే పోలింగ్‌ను ముగించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. పోలింగ్ పూర్తయ్యే వరకు ఒపీనియన్ పోల్స్, ఎగ్జిట్‌పోల్స్‌పై నిషేధం ఉంటుంది. మీడియాలో అభ్యర్థుల ఇంటర్వ్యూలపై కూడా నిషేధం కొనసాగుతుంది. ఎన్నికలను పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం 5 గంట ల నుంచి గురువారం సాయంత్రం 5 గంటల వరకు జిల్లాలో మద్యం దుకాణాలు మూసి ఉంచుతారు.

బరిలో 30 మంది..

సిర్పూర్, ఆసిఫాబాద్ అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 30 మంది అభ్యర్థులు(సిర్పూర్‌లో 13 మంది, ఆసిఫాబాద్‌లో 17 మంది) ఎన్నికల క్షేత్రంలో తమ అదృషాన్ని పరీక్షించుకోనున్నారు. మొత్తం 4.53 లక్షల మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

మాక్ పోలింగ్‌తో మొదలు..

సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లిన ఎన్నికల సిబ్బంది.. గురువారం ప్రిసైడింగ్ అధికారి (పీఓ) ఆధ్వర్యంలో వాటిని పోలింగ్ కేంద్రంలో అమర్చుతారు. ఉదయం 5.30 గంటలకు పోటీలో ఉన్న అభ్యర్థుల తరఫున వచ్చిన ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహిస్తారు. ఇందులో నోటాకు సైతం ఓటు వేయాల్సి ఉంటుంది. ఉదయం 6.30 లేదా 6.40 గంటల్లోపు మాక్ పోలింగ్‌ను ముగించాలి. ఏజెంట్లు అన్ని పరిశీలించి సరే అంటేనే ఆ ఈవీఎంను ఓటింగ్‌కు ఉపయోగిస్తారు. ఏవైనా సందేహాలు ఉంటే రిజర్వ్ చేసిన ఈవీఎంను పరీక్షించి ఏజెంట్లు ఒప్పుకుంటే వాటిని ఓటింగ్‌కు వాడతారు. మాక్ పోలింగ్‌లో ప్రతి ఈవీఎంలో 50 ఓట్లకు తగ్గకుండా ఓట్లు వేసి ఏజెంట్ల సమక్షంలో లెక్కిస్తారు. అన్నీ సరిగా ఉంటే ఆ ఈవీఎంను వారి సమక్షంలోనే జీరో చేసి ఓటర్లు ఓటేసేందుకు ఉపయోగిస్తారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమవుతుంది.

ప్రత్యేక గుర్తులతో మార్కింగ్..

ఓటర్లు ఓటేసేందుకు వచ్చినప్పుడు అదనపు ప్రిసైడింగ్ అధికారి ప్రత్యేక గుర్తులతో మార్కింగ్ చేస్తారు. ఉదాహరణకు ఓటు వేయడానికి ట్రాన్స్‌జెండర్ వస్తే ఓటరు జాబితాలో పేరును అడ్డు గీత తోపాటు వారి క్రమసంఖ్యకు స్టార్ గుర్తు వేస్తారు. పురుషులు వస్తే అడ్డు గీత గీసి, మార్కింగ్ చేస్తారు. మహిళలు వస్తే వారికి అడ్డుగీతతో పాటు వారి క్రమ సంఖ్యకు వృత్తం చుడతారు. ఈ విధానంతో ఎవరెవరు ఎంత మంది ఓటేశారో సులువుగా తెలుసుకోవచ్చు.

పోలింగ్‌కు పటిష్ట బందోబస్తు



బందోబస్తులో పోలీసు బలగాలు

ఆసిఫాబాద్: అసెంబ్లీ ఎన్నికలకు జిల్లా అధికార యంత్రాంగం, పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టింది. ఎస్పీ సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల్లో 599 మంది పోలింగ్ కేంద్రాల్లో భద్రత కోసం పోలీసులు, పారా మిలటరీ దళాలు విధులు నిర్వర్తించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 80 సమస్యాత్మక, 67 మావోయిస్టు ప్రభావిత పోలింగ్ కేంద్రాలను గుర్తించిన విషయం తెలిసిందే. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా ఎస్పీ సురేశ్‌కుమార్ ఇప్పటికే జిల్లా పోలీసు అధికారులు, కేంద్ర బలగాలతో సమావేశం నిర్వహించి విధులపై అవగాహన కల్పించారు. జిల్లాలో మొత్తం ఐదుగురు అదనపు ఎస్పీలు, 20 మంది సీఐలు, 45 మంది ఎస్సైలు, ఏఎస్సై నుంచి హోంగార్డు స్థాయి వరకు 950 మంది పోలీసులు, 60 మంది గ్రేహౌండ్స్ బలగాలతో పాటు 40 సెక్షన్ల సీఆర్‌పీఎఫ్ బలగాలను వినియోగిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని పీటీజీ బాలుర పాఠశాల, కాగజ్‌నగర్‌లోని సెయింట్ క్లారెట్ స్కూల్‌లో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను బుధవారం జిల్లా జనరల్ ఎన్నికల పరిశీలకులు రాహుల్ రంజన్, పోలీస్ పరిశీలకులు డీకే చౌదరితో కలిసి ఎస్పీ సురేశ్‌కుమార్ పరిశీలించారు. భద్రతను కట్టుదిట్టం చేసేందుకు ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్ల వరకు ప్రజలు, 200 మీటర్ల దూరం వరకు వాహనాలను అనుమతించనున్నారు.

పసిపాపలతో విధులకు..



ఎన్నికల విధులకు వచ్చిన మహిళా ఉద్యోగులు చాలా మంది తమ వెంట పసిపిల్లలను వెంటబెట్టుకు వచ్చారు. బుధవారం ఉదయమే జిల్లా కేంద్రంలోని పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రానికి చేరుకున్నారు. మధ్యాహ్నం వరకు అలసిపోయిన చిన్నారులను ఆ తల్లులు ఓదారుస్తూ.. గోరు ముద్దలు తినిపిస్తూ కనిపించారు. బిడ్డలను ఎత్తుకునే 'ఎన్నికల సామగ్రి సరిగా ఉందా? లేదా?' అని తోటి సహచరులతో పనిచేస్తూ విధుల్లో తమ అంకితభావాన్ని చాటారు.

– సాక్షి, ఆసిఫాబాద్







నేడే పోలింగ్..

- ఎన్నికల సామగ్రి పంపిణీ పూర్తి
- బుధవారం సాయంత్రం వరకు పోలింగ్ కేంద్రాలకు చేరిన సిబ్బంది
- 87 రూట్లకు 350 వాహనాలు కేటాయింపు

జిల్లా వివరాలు	
నియోజకవర్గాలు	2
ఓటర్లు	4,53,538
పోలింగ్ కేంద్రాలు	599
బ్యాలెట్ యూనిట్లు	1,038
కంట్రోల్ యూనిట్లు	747
వీవీప్యాట్లు	839



జిల్లా కేంద్రంలోని ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో సిబ్బంది

సాక్షి, ఆసిఫాబాద్: శాసనసభ ఎన్నికల నిర్వహణకు సిబ్బంది సన్నద్ధమయ్యారు. బుధవారం మధ్యాహ్నం నుంచి ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలురు గురుకుల వసతిగృహం.. కాగజ్‌నగర్‌లోని సెయింట్ క్లారిటీ పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాల నుంచి ఎన్నికల సామగ్రిని రిటర్నింగ్ అధికారులు సిబ్బందికి పంపిణీ చేశారు. మధ్యాహ్న భోజనం అనంతరం సిబ్బంది సామగ్రిని తీసుకుని పోలీసుల భద్రత మధ్య ప్రత్యేక వాహనాల్లో సాయంత్రానికి పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు, సిబ్బందికి వసతుల కల్పన, సమస్యాత్మక కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ నిర్వహణ, పోలీసుల బందోబస్తు తదితర ఏర్పాట్లు అన్ని జిల్లా ఎన్నికల అధికారులు పూర్తి చేశారు.

బ్యాలెట్ యూనిట్‌పై అభ్యర్థుల చిత్రాలు..

ఎన్నికలకు ఈవీఎంలను అధికారులు సిద్ధంగా ఉంచారు. జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో 599 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ప్రతీ పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలో భాగమైన బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్ వీటిని నిర్వహించే కంట్రోల్ యూనిట్ ఉంటుంది. ఈ మేరకు సిర్పూర్ నియోజకవర్గంలోని 294 పోలింగ్ కేంద్రాలకు 25 శాతం అదనంతో 366 బ్యాలెట్ యూనిట్లు, ఆసిఫాబాద్‌లోని 305 పోలింగ్ కేంద్రాలకుగాను 25 శాతం అదనంతో 672 బ్యాలెట్ యూనిట్లు(ఈ నియోజకవర్గంలో రెండేసి బ్యాలెట్ యూనిట్లు వినియోగిస్తున్నారు) ఎన్నికల అధికారులు కేటాయించారు. వాటి పనితీరుపై ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇవ్వడమే కాకుండా.. పార్టీల ప్రతినిధుల సమక్షంలో ర్యాండమైజేషన్ ప్రక్రియ సైతం నిర్వహించారు. ఈసారి బ్యాలెట్ యూనిట్లలో అభ్యర్థుల చిత్రాలు, పార్టీల గుర్తులు ఉండనున్నాయి. అన్ని పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను గట్టి పోలీసు బందోబస్తు మధ్య తరలించారు.

87 రూట్లలో సామగ్రి తరలింపు...

జిల్లాలోని పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు 87 రూట్లుగా విభజించగా.. ఒక్కో మార్గానికి ఒక రూట్ అధికారితోపాటు సెక్టర్ అధికారిని నియమించారు. వీరు ఆ మార్గాల్లోనే ఎన్నికల సామగ్రిని పోలీసులు బందోబస్తు మధ్య తరలించారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా నిర్వహించేలా ఈ అధికారులు పర్యవేక్షిస్తారు. ప్రతీ రెండు గంటలకు పోలింగ్ శాతాన్ని ఆర్‌వోలకు అందజేస్తారు. పోలింగ్ పూర్తయ్యాక సామగ్రితోపాటు సిబ్బందిని పంపిణీ కేంద్రాలకు సురక్షితంగా చేరేలా చూస్తారు.

350 వాహనాలు వినియోగం..

జిల్లాలో ఎన్నికల క్రతువులో సిబ్బంది, సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు.. పోలింగ్ తర్వాత తిరిగి సురక్షితంగా ఆయా కేంద్రాలకు చేరవేసేందుకు మొత్తం 350 వాహనాలను ఎన్నికల అధికారులు వినియోగిస్తున్నారు. అలాగే శాసనసభ ఎన్నికలకు ఆర్టీసీ సైతం తన సేవలు అందిస్తోంది. ఇతర రాష్ట్రాల నుంచి ఎన్నికల విధులకు వస్తున్న పోలీసు బలగాలను తీసుకురావడానికి ఈ నెల 26, 27 తేదీల్లో జిల్లాకు చెందిన ఆర్టీసీ బస్సులను ఉపయోగించారు. వీటితో పాటు ఎన్నికల సిబ్బంది, సామగ్రి ఆయా నియోజకవర్గాలకు తరలించేందుకు ఆసిఫాబాద్ డిపోకు చెందిన 44 బస్సులను వినియోగిస్తున్నారు. ఎన్నికలు పూర్తయి సామగ్రిని స్ట్రాంగ్ రూంలకు తరలించే వరకు ఈ వాహనాలన్నీ అక్కడే ఉండనున్నాయి.

విధుల్లో 6,046 మంది..

జిల్లాలోని 599 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహణ కోసం ఎన్నికల సిబ్బంది, పోలీసులు మొత్తం 4,596 మంది విధుల్లో పాల్గొంటున్నారు. ఇందులో పీఓలు 719 మంది, ఏపీఓలు 719 మంది, ఓపీఓలు 1,438, మైక్రో అబ్జర్వర్లు 94 మంది, బీఎల్‌ఓలు 599 మంది, నోడల్ అధికారులు 16 మంది, సెక్టోరియల్ అధికారులు 87 మంది, రూట్ అధికారులు 174 మంది.. ఇలా మొత్తం 3,846 మంది ఎన్నికల విధుల్లో ఉన్నారు. వీరితోపాటు సీఆర్‌పీఎఫ్(పారామిలటరీ) బలగాలు 10 కంపెనీలు(ఒక్కో కంపెనీలో 100 మంది ఉంటారు), 1200 మంది ఇతర పోలీసు సిబ్బందితో కలిపి పోలీసులు 2,200 మంది బందోబస్తు విధుల్లో ఉంటారు.

గడువు ముగుస్తుందని ప్రకటిస్తారు..

పోలింగ్ గడువు ముగుస్తుందననే విషయాన్ని 15 నిమిషాల ముందే పీఓ ప్రకటిస్తారు. సాయంత్రం 4 గంటల లోపు పోలింగ్ కేంద్రంలో ఉన్న వారందరూ ఓటేయడానికి అర్హులే. ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన వెంటనే కంట్రోల్ యూనిట్(సీయూ)లోని 'క్లోజ్' బటన్‌ను నొక్కి.. అనంతరం కంట్రోల్ యూనిట్లో మొత్తం ఓట్లు, 17- ఏలో మొత్తం ఓట్లు, ఓటరు స్లిప్పులు సరిపోలుతున్నాయా చూసుకుంటారు. తర్వాత సీయూ స్విచ్ ఆఫ్ చేసి వీవీప్యాట్, బ్యాలెట్ యూనిట్లు డిస్ కనెక్ట్ చేస్తారు. పోలింగ్ ముగిసిన వెంటనే సీల్‌వేసి క్లోజ్ చేసిన సీయూ, బ్యాలెట్ యూనిట్లు, వీవీప్యాట్లను ఏ నియోజకవర్గం నుంచి పంపించారో మళ్లీ అక్కడికే వాటిని చేరుస్తారు. మరుసటి రోజు ప్రత్యేక భద్రత మధ్య లెక్కింపు కేంద్రంలోని స్ట్రాంగ్‌రూంలకు తరలిస్తారు.

పకడ్బందీగా సామగ్రి పంపిణీ

– జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల సామగ్రిని పకడ్బందీగా సిబ్బందికి పంపిణీ చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హేమంత్ బోర్కడే తెలిపారు. ఆసిఫాబాద్ నియోజకవర్గానికి సంబంధించి పీటీజీ బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ పరిశీలించారు. సిర్పూర్ నియోజకవర్గానికి సంబంధించి కాగజ్‌నగర్ పట్టణంలోని సెయింట్ క్లారిటీ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పంపిణీ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్, సిర్పూర్ రిటర్నింగ్ దీపక్ తివారి పరిశీలించారు.



ఆసిఫాబాద్‌లో చెట్టు కింద సామగ్రిని సరిచూసుకుంటున్న సిబ్బంది



కాగజ్‌నగర్‌లో సామగ్రిని సరిచూసుకుంటున్న సిబ్బంది



సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళ్తూ..



బస్సు ఎక్కుతున్న సిబ్బంది

క్లుప్తంగా

గూడెంలో భక్తుల సందడి


దర్శనానికి బారులుతీరిన భక్తులు

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో బుధవారం భక్తుల రద్దీ నెలకొంది. భక్తులు క్యూలైన్‌లో నిల్చుని సత్యదేవున్ని దర్శించుకుని మొక్కు తీర్చుకున్నారు. సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఆచరించారు. కార్తీక దీపాలు వెలిగించారు.

గంజాయి పట్టివేత


గంజాయి, నిందితులతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

జైనూర్: రూ.3.50లక్షల విలువైన గంజాయి పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్, జైనూర్ ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. మండల కేంద్రానికి చెందిన షేక్ రహీం, కెరమెరి మండలానికి చెందిన షేక్ మహితాబ్ మహారాష్ట్రలో రూ.3.50లక్షల విలువైన 14 కిలోల గంజాయి కొనుగోలు చేసి కర్ణాటక రాష్ట్రానికి తరలించడానికి సిద్ధంగా ఉంచగా పట్టుకుని కేసు నమోదు చేశారు.

ప్రమాదవశాత్తు కిరాణాషాప్ దగ్ధం


దుకాణంలో దగ్ధమైన సామగ్రి

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని మదీనా కిరాణా దుకాణంలో బుధవారం ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించింది. దుకాణా యజమాని మొహినొద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు దుకాణం నుంచి పొగలు రావడాన్ని గమనించి సమాచారం ఇచ్చారు. వెంటనే వెళ్లి దుకాణం తెరిచి చూడగా అప్పటికే రూ.5 లక్షల విలువైన కిరాణా సామాగ్రి, రూ.75 వేల నగదు కాలి బూడిదయ్యాయి. అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వగా సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదని యజమాని పేర్కొన్నారు.

2న జోనల్ స్థాయి క్రికెట్ పోటీలు

ఆదిలాబాద్: జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో డిసెంబర్ 2న జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఉమ్మడి జిల్లా అండర్–17 బాలుర విభాగంలో జోనల్ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు తమ సొంత ప్లెయింగ్ కిట్లతో పాటు నాలుగు సెట్ల అర్హత ధ్రువపత్రాలు పూర్తి చేసుకుని వెంట తీసుకు రావాలన్నారు. పోటీలకు హాజరయ్యే ఉమ్మడి జిల్లాలోని క్రీడాకారులు ఉదయం 9 గంటలకు స్టేడియంలో కన్వీనర్ పార్థసారథికి రిపోర్టు చేయాలని సూచించారు.

ఆ పోలింగ్ కేంద్రాలపై డేగ కన్ను !

- అసెంబ్లీ ఎన్నికలు బహిష్కరించాలని మావోయిస్టుల లేఖలు
- వామపక్ష ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి
- తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో కేంద్ర బలగాలు
- 13 నియోజకవర్గాల్లో గంట ముందే పోలింగ్ నిలిపివేత


వేమనపల్లిలో కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న సీపీ రెమా రాజేశ్వరి, డీసీపీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: వామపక్ష వాదంతో ప్రభావితమైన పోలింగ్ కేంద్రాలపై భద్రతా బలగాలు ప్రత్యేక దృష్టి సారించాయి. రాష్ట్రంలో మావోయిస్టుల కార్యకలాపాలు చాలా వరకు తగ్గిపోయాయి. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దుల్లో అప్పుడప్పుడు దాడులు, ఎన్‌కౌంటర్లు జరుగుతున్నా అంతర్రాష్ట్ర సరిహద్దులకే పరిమితం అవుతున్నాయి. తెలంగాణ భూ భాగంలో చూస్తే చివరగా, 2020సెప్టెంబర్‌లో కాగజ్‌నగర్ అడవుల్లో ఇద్దరు మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు. ఆ తర్వాత ఇలాంటి ఘటనలు జరగలేదు. మారిన పరిస్థితులతో క్రమంగా పోలీసు భద్రత పెరగడం, రోడ్లు, వంతెనల రాకతో అటవీ సమీప ప్రాంతాల పోలింగ్ కేంద్రాల్లోనూ వసతులు కలుగుతున్నాయి. 2018 ఎన్నికల్లో వామపక్ష ప్రభావిత ప్రాంత పోలింగ్ కేంద్రాల్లో చాలాచోట్ల 70శాతానికి పైగా ఓటింగ్ జరగడం గమనార్హం

భారీగా బందోబస్తు

రాష్ట్ర వ్యాప్తంగా 119స్థానాల్లోని 28శాసనసభ నియోజకవర్గాల్లో 614పోలింగ్ కేంద్రాలు వామపక్ష ప్రభావం ఉన్నట్లు గుర్తించారు. ఇప్పటికే మూడు దఫాలుగా పోలింగ్ ముందు, పోలింగ్ రోజు, పోలింగ్ తర్వాత చేపట్టాల్సిన బందోబస్తుపై ప్రత్యేక ప్రణాళికతో ఉన్నారు. ఓటింగ్ రోజు పక్కాగా 144సెక్షన్ అమలు, పోలింగ్ తర్వాత చీకటి పడకముందే ఈవీఎంలను భద్రంగా స్ట్రాంగ్ రూంకు తరలించడం, సిబ్బందికి ఎలాంటి ఘటనలు ఎదురుకాకుండా రక్షణ కల్పించనున్నారు. ఈ క్రమంలో


మహారాష్ట్ర-తెలంగాణ సరిహద్దుల్లో డ్రోన్ పెట్రోలింగ్

రాష్ట్రంలో 13నియోజకవర్గాల్లో గంట ముందే పోలింగ్ ముగించనున్నారు. మిగతా చోట్ల ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటే, ఇక్కడ మాత్రం నాలుగు గంటల వరకు క్యూలో ఉన్నవారికే ఓటేసే అవకాశం ఉంటుంది. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో భౌగోళిక ఇబ్బందులతో నెట్‌వర్క్ సిగ్నల్ లేకపోవడం, అటవీ, నదీ తీర ప్రాంతాలు, అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలు, గిరిజన గూడేలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సమస్యాత్మక కేంద్రాల్లో వెయ్యికి పైగా కేంద్ర, పారామిలిటరీ, 7500సాయుధ బలగాలు రాష్ట్రాల సరిహద్దుల్లో విధుల్లో ఉన్నారు. బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్, సమస్త సీమ బల్, జార్ఖండ్ ఆర్మ్‌డ్ బెటాలియన్ బలగాలతోపాటు స్థానిక పోలీసులతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. డ్రోన్ కెమెరాలతో పెట్రోలింగ్ చేస్తున్నారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ సరిహద్దులు, ఒడిశా వైపు నుంచి వచ్చే వారిపై నిఘా కొనసాగుతోంది.

'మావో'ల హెచ్చరిక లేఖలు

కేంద్ర, రాష్ట్ర అధికార, విపక్ష పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థుల పేర్లతో సహా నియోజకవర్గాల్లో మావోయిస్టు పార్టీ నుంచి హెచ్చరిక లేఖలు విడుదల అవుతున్నాయి. బూటకపు ఎన్నికలు బహిష్కరించాలని ప్రజలకు పిలుపునిస్తున్నారు. సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లోనూ కోల్‌కమిటీ పేరుతో ప్రకటనలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉంటూ ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు కృషి జరుగుతోంది. రాష్ట్రంలో కొత్తగూడెం, ములుగు జిల్లాలో అత్యధికంగా వామపక్ష ప్రభావ పోలింగ్ కేంద్రాలున్నాయి.

జిల్లా	నియోజకవర్గాలు	వామపక్ష ప్రభావిత పోలింగ్ కేంద్రాలు
మంచిర్యాల, పెద్దపల్లి	09	46
ఆసిఫాబాద్	02	61
ఆదిలాబాద్	04	44
నిర్మల్	01	17

'పట్నం' ఓటర్లపై అభ్యర్థుల దృష్టి

- ప్రయాణ చార్జీలిచ్చి రప్పిస్తున్న వైనం

చెన్నూర్: అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీల అభ్యర్థులు అందివచ్చిన ప్రతీ అవకాశాన్ని వినియోగించుకుంటున్నారు. ప్రచార పర్వం ముగియగా పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి సారించారు. చెన్నూర్ నియోజకవర్గంలో ఓటుండి వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న వారిని రప్పించే పనిలో పడ్డారు. పార్టీ నాయకులతో ఇలాంటివారి జాబితాలను సిద్ధం చేయిస్తున్నారు. ఓటర్ల హోదాలను బట్టి దారి ఖర్చులు భరిస్తున్నారు. కొందరికి వాహనాలు సమకూరుస్తున్నారు. మరి కొందరికి ప్రయాణ చార్జీలు, ఇతర ఖర్చులు చెల్లిస్తున్నారు. ఒక్కొక్కరికి సుమారు రూ.10నుంచి రూ.15వేల వరకు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా పంపిస్తున్నట్లు సమాచారం.

ఎన్నికల వేళ.. బస్సులు కిటకిట

- ఓటేసేందుకు సొంతూళ్లకు జనం
- అడ్వాన్స్‌గా బస్ టికెట్ల బుకింగ్
- రద్దీకి తగినట్లు ఆర్టీసీ చర్యలు


రద్దీగా మంచిర్యాల బస్టాండ్

మంచిర్యాలఅర్బన్: గురువారం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఆర్టీసీ బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. వివిధ అవసరాల నిమిత్తం ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న వారంతా ఓటేసేందుకు సొంతూళ్ల బాట పడుతున్నారు. దీంతో బస్టాండ్లు రద్దీగా మారాయి. పోలింగ్ తేదీకి మూడ్రోజుల ముందు నుంచే టికెట్లు బుక్ చేసుకున్నారు. హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి మంచిర్యాలకు వచ్చే ప్రయాణికుల సంఖ్య పెరగటంతో ఆర్టీసీ స్పెషల్ సర్వీసులు నడుపుతోంది. ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు, సామగ్రి తరలింపునకు 60 బస్సులు కేటాయించగా.. ఇతర డిపోలకు చెందిన బస్సులను డౌన్ నుంచి మంచిర్యాలకు వచ్చేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఓవైపు వివాహాలు కూడా ఉన్నాయి. దీంతో మంచిర్యాల నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్సు ఇలా వచ్చిందో లేదో.. సీటు కోసం దానిని చుట్టుముట్టేస్తున్నారు. మంచిర్యాల డిపో నుంచి హైదరాబాద్‌కు 38 బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. ఎన్నికల వేళ మూడ్రోజులుగా ఆన్‌లైన్ టికెట్ రిజర్వేషన్లతో బస్సులు ఫుల్ అయ్యాయి. డౌన్ నుంచి రద్దీ నేపథ్యంలో మంచిర్యాల నుంచి ముందస్తుగా హైదరాబాద్‌కు నాలుగు బస్సులు పంపించారు. ఎన్నికల కోసం 60 బస్సులు కేటాయించగా నిర్మల్ డిపోకు చెందిన మరో రెండు బస్సులు హైదరాబాద్ నుంచి మంచిర్యాలకు నడుపుతున్నారు. ఇవే కాకుండా రద్దీకి అనుగుణంగా మరిన్ని బస్సులు నడుపుతామని ఆర్టీసీ డీఎం రవీంద్రనాథ్ 'సాక్షి'కి తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

మందమర్రిరూరల్: మందమర్రిలోని అంగడి బజార్‌కు చెందిన కొక్కెర మల్లమ్మ (60) బుధవారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లమ్మ ఉదయం వాటర్ హీటర్ వేసిన అనంతరం కొద్దిసేపటికి అనుకోకుండా దానిని పట్టుకోవడంతో షాక్‌కు గురై గురైంది. పనిమీద బయటకు వెళ్లిన ఆమె భర్త బీరయ్య కాసేపటికి ఇంటికి వచ్చి చూడగా విగతజీవిగా పడి ఉంది. మృతురాలికి భర్త ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

స్పందించారు.. శుభ్రం చేశారు


నిన్న మైదానం ఇలా..


నేడు ఇలా..

సాక్షి స్పందన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానం చెత్తాచెదారంతో నిండి అపరిశుభ్రంగా మారగా 'డంప్‌యార్డులా పాఠశాల మైదానం' శీర్షికన బుధవారం 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి మంచిర్యాల మున్సిపల్ అధికారులు స్పందించారు. ఉదయమే పారిశుధ్య కార్మికులతో మైదానంలోని చెత్తాచెదారం, వాడి పడేసిన ప్లేట్లు, వాటర్ ప్యాకెట్లు, బాటిళ్లు తొలగించి శుభ్రం చేయించారు. మైదానం పరిశుభ్రంగా మారేందుకు కృషి చేసిన 'సాక్షి'కి వాకింగ్, జాగింగ్ కోసం వచ్చినవారు కృతజ్ఞతలు తెలిపారు.

చీరెలు, మద్యం పట్టివేత


సీసీసీ కార్నర్ వద్ద పట్టుకున్న చీరెలతో అధికారులు


శ్రీరాంపూర్: పట్టుకున్న చీరెలతో ఎఫ్ఎస్టీ సభ్యులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కటిక దుకాణాల వద్ద, ఇతర కార్మిక వాడల్లో ఓటర్లకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచిన మద్యం బాటిళ్లు, చీరెలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం (ఎఫ్ఎస్టీ) బుధవారం పట్టుకుంది. ఒక ఇంట్లో 41, మరో ఇంట్లో 15 మద్యం బాటిళ్లను ఎఫ్ఎస్టీ సభ్యులు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు మరో ఇంట్లో 110 చీరెలను ఎఫ్ఎస్టీ బృందం పట్టుకుని సీజ్ చేసింది.

నస్పూర్ పట్టణ పరిధిలో..

నస్పూర్: పట్టణ పరిధిలోని సీసీసీ కార్నర్ ఎస్బీఐ సమీపంలో వాహన తనిఖీ సమయంలో ఓ వ్యక్తి బైక్‌పై తీసుకువెళ్తున్న 197 చీరెలను ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది బుధవారం పట్టుకున్నారు. ఎలాంటి ఆధారం చూపకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

జిల్లా కేంద్రంలో రూ.4లక్షలు పట్టివేత

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డులో రాజీవ్‌నగర్‌కు చెందిన చిప్పకుర్తి సురేశ్ ఎలాంటి ఆధారం లేకుండా తరలిస్తున్న రూ.4లక్షల నగదును బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై జగదీశ్ తెలిపారు. పట్టుకున్న మొత్తాన్ని ఓ జాతీయ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థికి చెందినదిగా గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నగదును ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారి మధూకర్‌కు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

నల్లసూరీలే న్యాయనిర్ణేతలు!

- ఫలితాలు ప్రభావితం చేసేది వీరే!
- గత మంచిర్యాల తీర్పే నిదర్శనం
- ఆచీతూచి అడుగేస్తున్న అభ్యర్థులు
- నగదు, మద్యంతో ఓటర్లకు ఎర



శ్రీరాంపూర్: మంచిర్యాల అసెంబ్లీ ఎన్నికల్లో నల్లసూరీలు న్యాయనిర్ణేతలు కాబోతున్నారా..? అనే ప్రశ్నకు అంతటా అవుననే సమాధానం వస్తోంది. ఇందుకు 2018 ఎన్నికల ఫలితాలే నిదర్శనం. నియోజకవర్గంలో సింగరేణి ఓట్లు అధికసంఖ్యలో ఉన్నాయి. ప్రతీ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపోటములను ప్రధానంగా వీరే ప్రభావితం చేస్తున్నారు. నియోజకవర్గంలో 2,74,807 మంది ఓటర్లున్నారు. వీరిలో అత్యధికులు నస్పూర్ మండల పరిధిలోని శ్రీరాంపూర్‌లో ఉన్నారు. ఈ మండలంలో 68,608 మంది ఓటర్లున్నారు. ఈ మండల పరిధిలోనే సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా ఉంది. ఈ ఏరియాలోని అన్ని గనుల్లో 9,355 మంది కార్మికులు పని చేస్తున్నారు. ఇక్కడే నివాసముంటూ గోదావరిఖని, మందమర్రి ఏరియా గనుల్లో పనిచేసే వారు సుమారు మరో 500 మంది ఉన్నారు. అలాగే సివిల్, సివిక్, ఓసీపీ ఓబీల్లో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులు సుమారు 3,500 మంది దాకా ఉంటారు. ఇలా 14వేల మంది కార్మికుల ఓట్లు, వారి కుటుంబ సభ్యుల ఓట్లు పరిగణనలోకి తీసుకుంటే సుమారు 45వేల మంది ఓటర్లుంటారు. దీంతో నియోజకవర్గంలోని పార్టీల అభ్యర్థుల గెలుపోటములను సింగరేణి ఓటర్లు ప్రభావితం చేయనున్నారు. పార్టీల గెలుపు కోసం సింగరేణిలో తమ అనుబంధ కార్మిక సంఘాల నేతలు కూడా ప్రచారం చేస్తున్నారు. వారు సాధించిన కార్మికుల హక్కులతో ఇన్నాళ్లు ఓటర్లను ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేశారు. ఇక రెండ్రోజుల నుంచి ప్రలోభాలకు తెరలేపారు. చివరి ప్రయత్నంగా అభ్యర్థులంతా కార్మికవాడల్లో మద్యం బాటిళ్ల పంపకాలు చేపట్టారు. చీరెలు, డబ్బులు పంపిణీ చేసి ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.

గత ఫలితాలతోనే టెన్షన్.. టెన్షన్

2018 ఎన్నికల ఫలితాల్లో కోల్‌బెల్ట్ ఓట్లు లెక్కించే సమయంలో అభ్యర్థులకు ముచ్చెమటలు పట్టాయి. నియోజకవర్గంలోని దండేపల్లి నుంచి మొదలుకుని లక్సెట్టిపేట, హాజీపూర్, మంచిర్యాల వచ్చే దాకా అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, బీఆర్ఎస్ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే ఎన్.దివాకర్‌రావు మధ్య నువ్వా.. నేనా? అన్నట్లుగా ఫలితాలు వచ్చాయి. ఇద్దరి మధ్య కొద్ది ఓట్ల తేడానే వచ్చింది. అప్పటివరకు ఉన్న ఫలితాలను బట్టి కాంగ్రెస్‌దే గెలుపు అని అంతా భావించారు. ఇక కోల్‌బెల్ట్ ఓట్లు లెక్కించేసరికి ఒక్కసారిగా అప్పటివరకు ఉన్న ఫలితాలు, అంచనాలు తారుమారయ్యాయి. ఇక్కడి 209 బూత్ నుంచి 272 బూత్ వరకు మొత్తం 63బూత్‌లలో బీఆర్ఎస్‌కు వన్‌సైడ్‌గా ఓట్లు వచ్చాయి. ఒక్కసారిగా ఇక్కడి ఫలితాల్లో 3,121 ఓట్ల లీడ్ బీఆర్ఎస్‌కు రాగా కోల్‌బెల్ట్ ఓటర్ల పాత్ర నియోజకవర్గంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గత ఫలితాలు కూడా విశ్లేషిస్తే కోల్‌బెల్ట్ ఓట్లు ఎటు పడ్డా.. గంపగుత్తగానే పడుతాయనే టాక్ ఉంది. దీంతో ఈసారి కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు కోల్‌బెల్ట్‌పై అధిక ఫోకస్ చేశారు. గడిచిన రెండు రాత్రులు కీలకంగా చక్రం తిప్పి మద్యం, నగదు పంపకాలు సాగించారు. ఇక డిసెంబర్ 3వ తేదీన నల్లసూరీలు ఇచ్చే అంతిమతీర్పు ఎలా ఉంటుందో వేచి చూడాలి.

ఓటేసేందుకు వెళ్తున్నారా..!

- ఏదైనా ఒక కార్డు తప్పనిసరి



కైలాస్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వినియోగించుకునేందుకు ఓటర్లు ఏదైనా ఒక గుర్తింపు కార్డు అధికారులకు తప్పనిసరిగా చూపించాల్సి ఉంటుందని భారత ఎన్నికల సంఘం నిర్దేశించింది. అధికార యంత్రాంగం జారీ చేసిన పోల్ చీటీలు కేవలం పోలింగ్ కేంద్రాలు, ఓటర్లకు సంబంధించిన సమాచారాన్ని తెలిపేందుకు మాత్రమే తోడ్పడుతాయని ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు.

ఈసీ నిర్దేశించిన కార్డులు

- ఓటరు గుర్తింపు కార్డు
- ఆధార్ కార్డు
- ఉపాధిహామీ పథకం జాబ్‌కార్డు
- బ్యాంక్ పాస్‌బుక్
- హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్‌కార్డు
- డ్రైవింగ్ లైసెన్స్
- పాన్‌కార్డు
- పాస్‌పోర్ట్
- ఫొటోతో కూడిన పెన్షన్ డాక్యుమెంట్
- సర్వీస్ ఐడీ కార్డు
- వైకల్య ధ్రువీకరణ పత్రం
- కార్మిక శాఖ ద్వారా జారీచేసిన గుర్తింపు కార్డు
- ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు జారీ చేసిన గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి తప్పనిసరిగా తీసుకురావాలని అధికారులు సూచించారు. పోలింగ్ బూత్‌లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబడవు.

ఎవరికీ పట్టని సరిహద్దు గ్రామాలు


లేండిగూడలో నిరుపయోగంగా వాటర్‌ట్యాంక్


కంకర తేలిన పరందోలి రోడ్డు

- రెండు రాష్ట్రాల పాలనలో ఇక్కట్లపాలు
- నేడు ఓటేయనున్న 3,383 మంది ఓటర్లు
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

కెరమెరి(ఆసిఫాబాద్): ఇటు తెలంగాణ.. అటు మహారాష్ట్ర.. ఈ రెండు ప్రభుత్వాలు సరిహద్దులో ఉన్న కెరమెరి మండలంలోని 14 వివాదాస్పద గ్రామాలను ఏళ్లతరబడి పాలిస్తున్నాయి. కానీ.. ఏ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో గ్రామాల్లో ప్రధాన సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఎన్నికలప్పుడే వచ్చే నేతలు హామీలు ఇచ్చి ఆ తర్వాత పట్టించుకోవడంలేదని ఈ గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. గురువారం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తుండగా 14 గ్రామాల్లో నివసించే 3,383 ఓటర్లు ఓటు వినియోగించుకోనున్నారు. పరంధోళి పంచాయతీ పరిధిలో పరంధోళి, కోటా, పరందోళి తండా, శంకర్‌లొద్ది, లేండిజాల, ముకద్దంగూడ పరిధిలో మహరాజ్‌గూడ, ముకదంగూడ, అంతాపూర్ పరిధిలో అంతాపూర్, ఇంద్రానగర్, పద్మావతి, ఏసాపూర్, నారాయణగూడ, భోలాపటార్ పరిధిలో భోలాపటార్, లేండిగూడ, గౌరీ గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లో సుమారు 1,520 కుటుంబాలుండగా.. 5,875 జనాభా ఉంది. కాగా, ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బెల్లంపల్లిలో పోటాపోటీగా ప్రలోభాల పర్వం!



బెల్లంపల్లి: అసెంబ్లీ ఎన్నికల ప్రచార పర్వం ముగియగా రెండు ప్రధాన పార్టీలకు చెందిన బెల్లంపల్లి అభ్యర్థులు పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి సారించారు. ప్రలోభాలకు తెరలేపి ఓటర్లకు ఎర వేస్తున్నారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకు డబ్బు, మద్యం పంపిణీ చేశారనే ఆరోపణలున్నాయి. ఓ అభ్యర్థి బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఓటుకు రూ.వెయ్యి చొప్పున, మరో అభ్యర్థి రూ.500 చొప్పున నగదు పంపిణీ చేసినట్లు సమాచారం. ముందుగా ఓటుకు రూ.500 మాత్రమే పంపిణీ చేసిన రెండో అభ్యర్థి కూడా తానేం తక్కువ కాదని ఆ తర్వాత మరో రూ.500 ఇచ్చినట్లు తెలిసింది. నగదుతోపాటు మద్యం బాటిళ్లు కూడా పంపిణీ చేసినట్లు సమాచారం. గ్రామాల్లోనూ ఈ అభ్యర్థులే ఓటుకు రూ.500 చొప్పున పంపిణీ చేసినట్లు తెలిసింది. కాగా, అభ్యర్థులు ప్రలోభాలకు తెరలేపి ఎలాంటి ఆటంకం లేకుండా ప్రక్రియ పూర్తి చేసినా.. ఎక్కడా అధికారులు నిలువరించిన దాఖలాలు లేకపోవడం గమనార్హం.

అశ్వవాహనంపై స్వామివారి ఊరేగింపు


స్వామి వారిని ఊరేగిస్తున్న భక్తులు

జైనథ్: మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో బుధవారం రాత్రి అశ్వరథోత్సవం నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను అశ్వ వాహనంపై ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, రాత్రి స్వామి వారికి అభిషేకాలు గావించారు. రాత్రి వేళ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను అశ్వ వాహనంలో ప్రతిష్ఠించి, భక్తుల దర్శనార్థం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

రూ.45లక్షలు లాక్కెళ్లిన దుండగులు

- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

కాగజ్‌నగర్‌టౌన్: కారులోంచి రూ.45లక్షలను దుండగులు లాక్కెళ్లిన ఘటన బుధవారం కాగజ్‌నగర్ పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో చోటుచేసుకుంది. వివరాలు.. పట్టణంలోని ఈద్గా కాలనీకి చెందిన ఎన్ఆర్ఐ సత్యనారాయణ మంగళవారం రాత్రి 11గంటల ప్రాంతంలో పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో తన కారు నిలిపాడు. ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు అక్కడకు వచ్చి సత్యనారాయణను తోసేసి కారు వెనుకభాగంలో ఉంచిన రూ.45లక్షలు ఎత్తుకెళ్లారు. దీంతో బాధితుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్‌హెచ్‌వో బీ స్వామి తెలిపారు.